## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు సత్కారం



**చిక్కడపల్లి:** ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపికైన ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను రేషన్‌డీలర్ల సంఘం సభ్యులు అప్పారావు సన్మానించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసిన అప్పారావు ఆయనను సన్మానించి మాట్లాడారు. గోపాల్ నాయకత్వంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

### అర్హులు 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోవాలి

**అంబర్‌పేట:** అర్హులైనవారు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ తెలిపారు. ఈ పథకానికి అర్హులైనవారికి ఆయన శుక్రవారం దరఖాస్తులు అందజేశారు. గృహిణీల పేరుపై ఇళ్ల స్థలం ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తుందన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే మంజూరుకోసం సహకరిస్తానన్నారు.

### మోటర్ సైకిళ్లు ఇవ్వాలని వినతి



**చిక్కడపల్లి:** భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం మోటారు సైకిళ్లు ఇవ్వాలని కోరుతూ.. మంత్రి మల్లారెడ్డికి తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ నేతలు శుక్రవారం దరఖాస్తులు అందజేశారు. ఇటీవల కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట శుక్రవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించి అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వంగూరు రాములు, రామ్మోహన్‌రావు, కోటం రాజు, జంగయ్య మాట్లాడారు. భవన నిర్మాణ, కార్మికులకు ప్రకటించిన లక్ష మోటార్ సైకిళ్లు వెంటనే ఇవ్వాలని కోరారు.

### జీహెచ్ఎంసీ సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ

**కాచిగూడ:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు జీహెచ్ఎంసీ చెత్త సేకరణ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. జీహెచ్ఎంసీ చెత్త సేకరణ సిబ్బందికి శుక్రవారం కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెత్త రహిత డివిజన్‌గా కాచిగూడను తీర్చిదిద్దుతున్నామని, ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఇంటికి చెత్త సేకరణ కోసం వచ్చే సిబ్బందికి మాత్రమే అందజేసి స్వచ్ఛ డివిజన్‌కు సహకరించాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్‌పటేల్, నర్సింగ్‌రావు, మల్లికార్జున్, ప్రతిభ, బీమ్‌రాజ్, ఓంప్రకాష్, ఎస్.రవియాదవ్, సూరి, రామకృష్ణ, ఆర్.సంతోష్, దినేష్‌బాబు తదితరులున్నారు.

### అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లో నూతన, పెండింగ్‌లో ఉన్న తాగునీటి, సీవరేజ్ పైపులైన్ పనులను పూర్తిచేయాలని కోరుతూ.. జలమండలి ఎండీ దానకిశోర్‌కు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో పెరిగిపోతున్న తాగునీటి సమస్య, కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ప్రజా సమస్యలను పరిష్కరించేలా శాశ్వత పరిష్కర చర్యలు చేపట్టాలని ఎండీని కోరామన్నారు.

### పొట్టి శ్రీరాములు జీవితమంతా పోరాటమే

**చిక్కడపల్లి:** పొట్టి శ్రీరాములు ఒక ధర్మబద్ధమైన ఆశయంతో పోరాటం వివిధ సందర్భాల్లో చేశారని కొందరు అనుకున్నట్లు ఆయన విప్లవకారుడు కాదని ఐక్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. ఆయన జీవితమంతా పోరాటాలే అని తెలిపారు. త్యాగరాయగానసభలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట జీవిత కథ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ.. నెహ్రూ దేశ రూపశిల్పి ఐతే శ్రీరాములు దేశ భౌగోళిక రూపకర్త అని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు రామచంద్ర గుహ అన్నార న్నారు. శ్రీరాములు వల్లనే భాషా రాష్ట్రాల ఆవిర్భావం జరిగిందన్నారు. సాహితీవేత్త డాక్టర్ కోయ కోటేశ్వర్‌రావు, ప్రముఖ పత్రికా రచయిత రామచంద్రమూర్తి, దేవకీ అనురాధ, డాక్టర్ వంశీ రామరాజు పాల్గొన్నారు.

# వైద్య విధానంలో ఫిజియోథెరపీ పాత్ర కీలకం

**సెప్టెంబర్ 8న ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం**



ఫిజియోథెరపిస్టులతో డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఎస్. ఉషారెడ్డి

**నల్లకుంట:** నేటి ఆధునిక వైద్య విధానంలో ఫిజియోథెరపీ పాత్ర కీలకమని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) అధ్యక్షురాలు ఎస్.ఉషారెడ్డి అన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ(డీడీసీవోపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి రీసెర్చ్ సెంటర్(డీడీహెచ్ ఆర్‌సీ) ఆడిటోరియంలో వరల్డ్ ఫిజియో థెరపీడేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె దివంగత దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మందుల ద్వారా కాకుండా ఫిజియోథెరపీ ద్వారా జబ్బులను నయం చేయడం ద్వారా శరీరానికి ఎలాంటి నష్టం జరుగదని, ఫిజియోథెరపీని ప్రోత్సహించడం కోసం 1951 సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియోథెపీ కౌన్సిల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో ఫిజియోథెరపీపై ప్రజల్లో అవగాహన కలిగించడం కోసమే ప్రతి ఏటా సెప్టెంబర్ 8న ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. ప్రముఖ సంఘ సేవకురాలు దుర్గాబాయిని స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు సూచించారు.

- డీడీసీవోపీ అకాడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ వైఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. శరీర అవయవాలను పూర్వస్థితికి తీసుకురావడానికి చేసే ప్రయత్నమే ఫిజియోథెరపీ చికిత్స అన్నారు. ఫిజియోథెరపీ కోర్సులో చేరే విద్యార్థులకు మానవ శరీర నిర్మాణం, వివిధ అవయవాల పనితీరుపై నేర్పిస్తామన్నారు. అనాటమీ, ఫిజియాలజీ, పాథాలజీ, ఫార్మరాలజీ, సైకాలజీ, మెడికల్, సర్జికల్ కండీషన్లు, బయోమెకానిక్స్, డిజేబిలిటీ ప్రివెన్షన్, రిహాబిలిటేషన్ తదితర అంశాలపై పట్టు సాధిస్తే ఫిజియోథెరపీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కోర్సులో థియరీ, ప్రాక్టికల్స్ రెండింటికీ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఫిజియోథెరపీ విద్యార్థులు శరీరంలో ఎముకలు, కండరాలు, నాడీ వ్యవస్థపై అవగాహన పెంచుకున్నప్పుడే రోగులకు మెరుగైన చికిత్సలు అందించడం సాధ్యమవుతుందన్నారు. కోర్సు చదువుతున్నప్పుడే ఫిజియాలజీ, అనాటమీ, ఎక్సర్‌సైజెస్ థెరపీ విభాగాలపై పట్టుసాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ విద్యార్థులు పక్షవాతం, స్పోర్ట్స్ గాయాలైన వారికి యోగా థెరపీ, మ్యూజిక్ థెరపీ ద్వారా చికిత్సలు అందించి స్వాంతన చేకూర్చారు. డీడీసీవోపీ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవైఆర్ క్రిష్ణారావు, కళాశాల కార్యదర్శి కె.లక్ష్మీ సుందరి, ప్రిన్సిపాల్ ఛాయానందిని పాల్గొన్నారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్లు హన్నారాజ్, ఆదిత్య, కే.వి.సుకుమార్‌రెడ్డి, పమీలా నారాయణ్, జీఎస్. శ్రవణ్‌కుమార్, యతీంద్రకుమార్, వై. శ్రవణ్‌కుమార్ తదితరులను ఘనంగా సత్కరించారు.



మ్యూజిక్ థెరపీతో స్వాంతన కలిగిస్తున్న విద్యార్థులు

# ఓయూపై కేసీఆర్‌కు కక్ష



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** వందేళ్ల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీ మీద ముఖ్యమంత్రి కేసీఆర్ కక్షకట్టారని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. ఓయూ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని అందులో భాగంగానే అసమర్థత గల వీసీలను నియమించి విశ్వవిద్యాలయ భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను భ్రష్టు పట్టిస్తోందన్నారు.. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎత్తి వేసే పద్ధతిని ఉపసంహరించుకోవాలని విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెంచిన అన్ని రకాల ఫీజులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ మాట్లాడుతూ కేసీఆర్‌ను ఓడించడంతోనే ఓయూను రక్షించుకుంటామని అన్నారు. విదేశాల్లో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో మూడు శాతం కంటే తక్కువ కేటాయిస్తున్నారని అన్నారు. పేదలను ఉన్నత విద్యకు దూరం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కేసీఆర్ కనుసన్నల్లోనే విశ్వవిద్యాలయాల ప్రతిష్ట దిగజారిపోతుందన్నారు. ఓయూలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ కోర్సులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజషా, ప్రొఫెసర్ వినయ్‌బాబు, సంఘం ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, పల్లె వినయ్, పుష్ప, ఆశాప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు అనైతికం

**కాచిగూడ:** సనాతన ధర్మాన్ని కించపరిచేలా ఎవరూ మాట్లాడినా సహించేదిలేదని 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్, ఎంసీహెచ్ ఫ్లోర్‌లీడర్ ఎస్.గోపాల్‌రావు హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉందని, ప్రపంచ దేశాల ప్రజలు హిందూసంస్కృతి, సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని గౌరవిస్తుండగా.. తమిళనాడు సీఎం స్టాలిన్ కుమారుడు, ఆ రాష్ట్రమంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన హిందూధర్మాన్ని కించపరిచేలా మాట్లాడటం దారుణమన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని గూర్చి తక్కువచేస్తూ.. మాట్లాడేవారంతా మూర్ఖులని, ధర్మంపై సరైన అవగాహన లేక పిచ్చివారిగా మాట్లాడుతున్నారన్నారు. హిందువులంతా ఐక్యమై ఇలాంటి వారిని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హిందూధర్మం ఎవరికీ వ్యతిరేకం కాదని ఎవరైనా హిందూ ధర్మాన్ని కించపరుస్తూ.. మాట్లాడితే మాత్రం వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

### కోతి దాడిలో గాయపడిన వ్యక్తికి ఫీవర్‌లో చికిత్స

**నల్లకుంట:** తీర్థయాత్రకు వెళ్లిన ఓ వ్యక్తిని కోతి కరిచింది. గత రెండు రోజులుగా అతను వింతగా ప్రవర్తిస్తుండటంతో చికిత్స నిమిత్తం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన శ్రీనివాసచారి(43) ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా ఇటీవల యాదగిరిగుట్టకు వెళ్లిన అతడిపై అక్కడ ఓ కోతి దాడిచేసి గాయపరిచింది. ఆ సమయంలో అతను సరైన చికిత్స తీసుకోలేదు. ఈ క్రమంలో రేబీస్ లక్షణాలతో వింతగా ప్రవర్తిస్తున్న అతడిని చికిత్స కోసం గురువారం సాయంత్రం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన అక్కడి వైద్యులు ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. కాగా అతడికి రేబీస్ సోకిందా.. లేదా అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఒకవేళ రేబీస్ సోకితే బ్రతకడం కష్టమని, రేబీస్‌కు చికిత్స లేదని ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి.

### అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ గోల్నాక వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెంది ఉన్నాడు. కాగా మృతుడి ఒంటిపై తెలుపురంగు పూర్తి చేతుల చొక్కా, నలుపు రంగు ఆఫ్ చెడ్డి ఉంది. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధుడి అదృశ్యం



ఖాజా జియాజుద్దీన్ (ఫైల్)

**కాచిగూడ:** ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన తన తమ్ముడి వద్ద ఉండే ఖాజా జియాజుద్దీన్ (75) బాగ్‌లింగంపల్లిలో అద్దె ఇంటికోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి సోదరుడు ఖాజా షంషుద్దీన్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యారంగానికి ప్రైవేటు టీచర్ల సేవలు అమోఘం



మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రాష్ట్రంలో విద్యారంగానికి ప్రైవేటు టీచర్లు చేస్తున్న సేవలు ఎనలేనివని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఉన్నత విద్యలో చాలా ముందుందని, ఉన్నత విద్యారంగంలో మహిళలు 40.03 శాతం ఉండటం గొప్ప పరిణామన్నారు. సైన్స్‌రంగంలో మహిళలు అధికశాతం ఉండటం హర్షనీయమన్నారు. ప్రైవేటు టీచర్స్ తమ హక్కుల కోసం పోరాడుతూనే మరో వైపు విద్యారంగంలో మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులను ఆదుకునేందుకు తమ వంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ.. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. వారికి ప్రకృతి, సమాజంపై బాధ్యత కల్పించాలన్నారు. ప్రకృతితో విద్యార్థులు మమేకమైతే సమాజానికి ఉపయోగం ఉంటుందన్నారు. ఒక టీచర్ తప్పుగా బోధిస్తే అది ఎంతో నష్టదాయకమని, కులం, మతానికి అతీతంగా బోధన జరగాలని సూచించారు. విజ్ఞానదర్శిని వ్యవస్థాపకులు రమేష్, ప్రొఫెసర్ శ్రీనివాస్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, హైదరాబాద్ కన్వీనర్ కె.విజయ్‌కుమార్, సైదులు, నరేష్, చందు తదితరులున్నారు.

## క్విజ్ పోటీలు



పాల్గొన్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో యూనియన్‌బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూ జీనియస్ జనరల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ డాక్టర్ అలుగవర్షిణి ఈ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ సీజీఎం, రీజినల్ హెడ్ కె.భాస్కర్‌రావు మాట్లాడుతూ.. రెండేళ్లుగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో యూనియన్ యూ జీనియస్ జనరల్ క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1800 మంది హాజరయ్యారన్నారు. దేశవ్యాప్తంగా 30 సెంటర్‌లలో ఈ పోటీలు జరిగాయన్నారు. గెలుపొందిన వారికి నవంబర్‌లో జాతీయ పోటీలను నిర్వహిస్తామని, విద్యార్థులకు బ్యాంకులపై అవగాహన పెంచుతామన్నారు. విద్యార్థులకు యూనియన్ ముస్కాన్ ఖాతాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. జీఎం కృష్ణసన్, డీజీఎం సోహన్ సిన్‌గుప్తా, డీజీఎం రామ్‌కుమార్, ఆనంద్‌కుమార్ తదితరులున్నారు.

# పర్యాటక రంగంలో మధ్యప్రదేశ్ మొదటి స్థానం



మాట్లాడుతున్న షియో శేఖర్ సుక్లా

**ముషీరాబాద్:** పర్యాటక రంగంలో దేశంలోనే మొదటి స్థానంలో మధ్యప్రదేశ్ ఉంటుందని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, మధ్యప్రదేశ్ టూరిజం బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ షియో శేఖర్ సుక్లా (ఐఏఎస్)అన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మారియెట్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రావెల్ ఏజెంట్లు, టూరు ఆపరేటర్లు, హోటల్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్, నవంబర్‌లో చందేరి ఫెస్టివల్, (చేనేత సాంస్కృతి సాహసాల సమ్మేళనం – 2023), పూణే ఫారెస్ట్ ఫెస్టివల్ (వన్యప్రాణుల ఆవాసం) పేరుతో మరో రెండు కొత్త ఉత్సవాలను పరిచయం చేయబోతున్నట్లు ప్రకటించారు. మధ్యప్రదేశ్ తరచుగా హార్ట్ ఆఫ్ ఇంక్రెడిబుల్ ఇండియాగా పిలువబడుతుందని, 785 పులులతో టైగర్ స్టేట్ ఆఫ్ ఇండియాగా పేరొందిందన్నారు. ఖజురహో, సాంచి, బీమ్‌బేటక్, గ్వాలియార్, వోర్చా, సత్పుడ టైగర్ రిజర్వ్, బేడాఘాట్ వంటి ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మూడు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలకు మధ్యప్రదేశ్ నిలయంగా ఉందన్నారు. యాత్రికులను మంత్రముగ్దులను చేసే టైగర్ రిజర్వ్‌లు, జాతీయ పార్కుల నిర్మాణం అద్భుతంగా ఉన్నాయని వివరించారు.

# మున్నూరుకాపులకు 22 అసెంబ్లీ టికెట్లు కేటాయించాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కాచిగూడ:** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన 22 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ బీజేపీని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్నూరుకాపు మహాసభ ప్రతినిధి బృందం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్, ప్రధానకార్యదర్శి సునీల్‌బన్సల్, రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌లను కలిసి 36మందితో కలసి వినతిపత్రాన్ని ఇచ్చామన్నారు. మున్నూరుకాపులకు బీజేపీలో టికెట్లు కేటాయిస్తే వారిని గెలిపించుకునే బాధ్యతలను మహాసభ తీసుకుంటుందన్నారు. మణికొండ రమేష్, కొండూరు వినోద్‌కుమార్, ఆది నాగేష్, ఆనంద్, మాణిక్‌ప్రభు, మడిగెల వెంకటేశ్వర్‌రావు, కొరివి వేణుగోపాల్, రామ్మోహన్, చెలిమల రమేష్, గంట శ్రీనివాస్, వేల్పుల శ్రీనివాస్, గూడెపు ప్రవీణ్ తదితరులున్నారు.

# కాళోజీది అరుదైన వ్యక్తిత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి:** అరుదైన వ్యక్తిత్వం జీవితం కాళోజీ నారాయణరావుదని రాష్ట్ర శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్యే మధుసూదనాచారి అన్నారు. కోటి గొంతుకలు ఒక్కటై నినదించిన వ్యక్తి ధిక్కారస్వరం కాళోజీ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో శుక్రవారం ప్రముఖ కవి కాళోజీనారాయణరావు జయంతి సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సమాజంలోని సమస్యలు, సంఘటనలు గురించి తెలుసుకుని అవి తనవిగా భావించి బాధ్యతగా భావించి సమాజం కోసం బాధ్యతగా వ్యవహరించాలనే భావనతో కాళోజీ ఉండేవారన్నారు. పూర్వం రుషులు తపస్సు చేసి దేవుళ్లను ప్రత్యక్షం చేసుకుని కోర్కెలు కోరుకునే వారని, కాళోజీ నారాయణరావు ఎక్కడ అన్యాయం, అక్రమాలు జరిగినా కోరకుండానే వెంటనే ప్రత్యక్షమై సమస్యలపై పోరాడేవారన్నారు. తెలంగాణ గౌరవానికి కాళోజీనారాయణరావు ప్రతిబింబం అని కొనియాడారు. తెలంగాణ నేతలను, నీటిని ప్రేమించిన కాళోజీ నారాయణరావు తెలంగాణ మాండలికంలోనే కవితలను రచించి ప్రజలను ఆకట్టుకున్నారన్నారు. ఆయన రాసిన నాగొడవ కవితలు తెలంగాణ ప్రజల బాధలగాదలను ప్రస్ఫుటింప చేశాయన్నారు. సినీ నిర్మాత రామసత్యనారాయణ, ఫాస్ ఫిలీం సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కె.ధర్మరావు, పీఎస్.ఆర్.మూర్తి, వడ్డేపల్లి కృష్ణ, బండి శ్రీనివాస్ తదితరులున్నారు.

## ప్రత్యేక పూజలు..



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ రచనశ్రీ

**కాచిగూడ:** శ్రావణమాసం నాల్గో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి అమ్మవారికి మహిళలు వైభవంగా పూజలు చేశారు. కాచిగూడ, నింబోలిఅడ్డలోని సరస్వతి శిశుమందిర్‌లో వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో మహిళలు సామూహికంగా వరలక్ష్మి వ్రతం చేశారు. ఎల్.విశాలాక్షీ, ఎం.లావణ్య, పుష్పలత, మల్లేశ్వరి, సీహెచ్. అమూల్య తదితరులున్నారు.

**కృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు**

**కాచిగూడ:** నింబోలిఅడ్డ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థులు రాధా కృష్ణుల వేషధారణలో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్ఏ వాణి మాట్లాడుతూ.. పిల్లల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ వారిలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

**సంతోషిమాత ఆలయంలో కార్పొరేటర్ పూజలు..**

**ముషీరాబాద్:** శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా కవాడిగూడ డివిజన్ జీరా ప్రాంతంలోని సంతోషిమాత దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు శేరుపల్లి గణేష్, కేశవరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్ కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్ష,కార్యదర్శులు ఎం.సీ మహేందర్‌బాబు, ఏ. ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నేతలు కుమార్‌గౌడ్, చంద్రశేఖర్, శివ, నాగరాజు పాల్గొన్నారు.

# నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు



ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హనుమంతరావు

**కాచిగూడ:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడం ద్వారానే అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు అన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు, మిట్ట ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలోని హాస్టల్ ప్రాంగణంలో ఉచిత నైపుణ్య శిక్షణ కంప్యూటర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అమెరికాకు చెందిన ఐటీ నిపుణులు రాజేందర్ ఎక్క మాట్లాడుతూ.. ట్యాలీ, జీఎస్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణకు యువతి, యువకులకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు మేనేజింగ్ ట్రస్టీ పాండురంగారావు, ట్రస్టీలు మంద సూర్యప్రకాష్, ఎక్క రాజేందర్, మిట్ట వినోద్‌కుమార్, పుంజరి సంజయ్ నారాయణ్ తదితరులున్నారు.

# ముషీరాబాద్ ఎమ్మెల్యే టిక్కెట్ కోసం దరఖాస్తులు



దరఖాస్తును అందజేస్తున్న ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు

**ముషీరాబాద్:** వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల కమిటీ నాయకులను కలిసి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ.. డివిజన్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనేక పదవులు నిర్వహించానన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ.. ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నానని తెలిపారు. అవకాశం ఇస్తే ముషీరాబాద్ నుంచి విజయం సాధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బహుమతిగా ఇస్తానని వివరించారు. బీజేపీ నాయకులు ఆయుష్, రమేష్, మహేష్, ప్రీతం తదితరులున్నారు.

**సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ దరఖాస్తు..**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించి, టికెట్ ఇస్తే పోటీ చేస్తానని కవాడిగూడ డివిజన్ దోమలగూడకు చెందిన ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు, సీనియర్ బీజేపీ నాయకుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ బీజేపీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిటీ నాయకులకు ఆయన దరఖాస్తును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం తాను చేసిన సేవలను అధిష్టానం గుర్తించి తనకు బీజేపీ టికెట్ కేటాయిస్తే యాదవ సామాజిక వర్గం, శ్రేయోభిలాషుల సహకారంతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు

**కాచిగూడ:** మత్తు పదార్థాలకు బానిసై, జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (ఎన్‌ఏబీ) ఏసీపీ సుబ్బిరామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం బర్కత్‌పురలోని అవంతి కళాశాలలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం గాడితప్పుతుందని, భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. అవంతి కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు, కాచిగూడ అడ్మిన్ ఎస్సై ఏ.మేఘన, ఎస్సై సుభాష్, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు తదితరులున్నారు.